# అనగనగా ఓ కథ

**నాగార్జున,** ధనుష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రం 'కుబేర' ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. రష్మిక మందన్న కథానాయిక. సమాజంలోని ఆర్థిక, సామాజిక అంతరాల్ని చర్చిస్తూ సందేశాత్మక కథతో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మంగళవారం సినిమాలోని 'అనగనగా కథ.. అందరికీ తెలిసిన కథ..' అంటూ సాగే రెండో గీతాన్ని విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యాన్నందించారు. సమాజంలోని ఆర్థిక అంతరాలు, అవినీతి వంటి అంశాలను చర్చిస్తూ లోతైన భావాలతో ఈ పాట సాగింది. హైదే కార్తీ, కరీముల్లా ఆలపించిన ఈ పాటలో ధనుష్, నాగార్జున పర్ఫార్మెన్స్ ఎమోషనల్‌గా సాగింది. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు



## విశ్వంభర విషయంలో మెగా ఆదేశం?

**అగ్ర** కథానాయకుడు చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా ఫ్యాన్సంతా ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఒకట్రెండు రోజుల ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సీజీ వర్క్ జరుగుతున్నది. 'విశ్వంభర' చిత్రాన్ని 90శాతం ఇండోర్‌లోనే తెరకెక్కించారు దర్శకుడు మల్లిడి వశిష్ట. కథానుసారం ఈ సినిమాకు 70శాతం సీజీ వర్కే ఉంటుంది. అందుకే.. ప్రపంచంలోనే పేరెన్నికగన్న వివిధ స్టూడియోలు ఈ సినిమా సీజీకి వర్క్ చేస్తున్నాయి. వాటినుంచి పూర్తి అవుట్ పుట్ వచ్చాకే సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించాలనేది 'మెగా' ఆదేశం. అందుకు నిర్మాతలు సైతం కట్టుబడి ఉన్నారని సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి చిరంజీవి, అనిల్ రావిపూడిల సినిమా విడుదల చేయనున్నట్టు ముందే ప్రకటించేసిన నేపథ్యంలో.. ఒక నాలుగు నెలలు తేడాతో 'విశ్వంభర' కూడా దానికంటే ముందే విడుదల కావాల్సివుంది. బహుశా 'విశ్వంభర' విడుదల దసరాకు ఉండొచ్చని ఫిల్మ్ వర్గాల టాక్. యూవీ క్రియేషన్స్ పతాకంపై ప్రమోద్ ఉప్పలపాటి, వి.వంశీకృష్ణారెడ్డి, విక్రమ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## రాజాసాబ్ వచ్చేది ఆరోజే!



**ప్రభాస్** అభిమానులకిది నిజంగా శుభవార్తే. వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 'ది రాజా సాబ్' చిత్ర విడుదల తేదీని మంగళవారం మేకర్స్ ప్రకటించారు. డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నెల 16న టీజర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. మారుతి దర్శకత్వంలో హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్' చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ కథానాయికలు. డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో ప్రభాస్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జోనర్ కావడంతో సినిమాపై అందరిలో ఆసక్తి రెట్టింపయ్యింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కార్తీక్ పళని, సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచన-దర్శకత్వం: మారుతి.

## డెకాయిట్ ఫైర్ థీమ్



**అడివి శేష్** నటిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా థ్రిల్లర్ 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. షానియల్ డియో దర్శకుడు. సుప్రియా యార్లగడ్డ నిర్మాత. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇటీవలే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్.. ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంటుందని, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫైర్ థీమ్‌ని మేకర్స్ విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ థీమ్ ఆడియన్స్‌కి ఓ భిన్నమైన అనుభూతిని అందిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: సునీల్ నారంగ్, సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్.

## అక్టోబర్‌లో 'తెలుసుకదా'



**సిద్ధు** జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా'. స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా అక్టోబర్ 17న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. హృదయాన్ని స్పృశించే అందమైన ప్రేమ కథా చిత్రమిది. కథలోని మలుపులు ఉత్కంఠను పంచుతాయి. నేటి జనరేషన్‌కు బాగా కనెక్ట్ అయ్యే కథాంశమిది. సిద్ధు జొన్నలగడ్డ పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: తమన్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్, రచన-దర్శకత్వం: నీరజ కోన.

## అమీర్ ప్లాన్‌కు దిగొచ్చిన నెట్‌ఫ్లిక్స్




**తన** తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' డిజిటల్ రైట్స్ విషయంలో అమీర్‌ఖాన్ తీసుకున్న నిర్ణయం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌ను సందేహంలో పడేసింది. 'సితారే జమీన్ పర్' ఓటీటీ హక్కులను ఏ సంస్థకు ఇవ్వనని, యూట్యూబ్‌లో పే పర్ వ్యూవ్ విధానంలో రిలీజ్ చేస్తానని అమీర్‌ఖాన్ కొద్దిరోజుల క్రితం ప్రకటించాడు. దీనివల్ల నెలవారి సబ్‌స్క్రిప్షన్ బాధ లేకుండా తక్కువ ధరకే నచ్చిన సినిమాను చూడొచ్చన్నది అమీర్‌ఖాన్ ఆలోచన. 'సితారే జమీన్ పర్' సినిమాతో ఈ మోడల్‌ను అమలు చేయాలని ఆయన ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ దిగొచ్చింది. 'సితారే జమీన్ పర్' చిత్రానికి తొలుత 60కోట్ల డిజిటల్ రైట్స్ ఆఫర్ చేయగా..ఇప్పుడు ఆ రేటును రెండితంలు చేసింది. 125కోట్లు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని నెట్‌ఫ్లిక్స్ బిజినెస్ టీమ్ అమీర్‌ఖాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నదట. అయితే ఈ విషయంలో అమీర్‌ఖాన్ ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని అంటున్నారు. ఒకవేళ అమీర్‌ఖాన్ చెబుతున్నట్లు నిర్మాతలందరూ యూట్యూబ్ పే పర్ వ్యూవ్ మోడల్‌ను ఫాలో అయితే డిజిటల్ బిజినెస్ మొత్తం పడిపోయే ప్రమాదం ఉందని ముంబయి ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నెల 20న 'సితారే జమీన్ పర్' ప్రేక్షకుల ముందుకురానుంది.

## నాన్‌స్టాప్ కామెడీ



**మహేష్** చింతల, విద్యాసాగర్, బలగం సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేకూరి దర్శకుడు. రమాశంకర్ నిర్మాత. సోమవారం జరిగిన ప్రీరిలీజ్ వేడుకకు దర్శకుడు తరుణ్ భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెండున్నర గంటల పాటు వినోదభరితంగా సాగే చిత్రమిదని, తెలంగాణ నేపథ్యంలో నడుస్తుందని దర్శకుడు తెలిపారు. ఎక్కడా నాటకీయత లేకుండా సహజసిద్ధమైన హాస్యంతో ఈ సినిమా మెప్పిస్తుందని నటుడు మహేష్ చింతల చెప్పారు. ఫ్యామిలీ మొత్తం చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## హిట్ దర్శకునితో రోషన్?



**శ్రీకాంత్** తనయుడు రోషన్ ప్రస్తుతం 'ఛాంపియన్' సినిమా చేస్తూ బిజీగా ఉన్నాడు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామాను ప్రియాంక దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ కలిసి నిర్మిస్తున్నారు. 70శాతం ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే.. మోహన్‌లాల్ మలయాళ చిత్రం 'వృషభ'లో కూడా రోషన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇదిలావుంటే, ఇప్పుడీ యంగ్ హీరో, విజయవంతమైన 'హిట్ సిరీస్' సినిమాలతో ప్రేక్షకులకు చేరువైన శైలేష్ కొలను దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారట. త్వరలో అధికారిక ప్రకటన రానున్నట్టు వినికిడి.

## చౌదరిగారి అబ్బాయితో



**'బిగ్‌బాస్'ఫేం** అమరదీప్ చౌదరి, సుప్రీతా నాయుడు జంటగా రూపొందుతోన్న లవ్ ఎంటర్టైనర్ 'చౌదరిగారి అబ్బాయితో నాయుడుగారి అమ్మాయి'. మాల్యాద్రిరెడ్డి దర్శకుడు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మేకర్స్ విడుదల చేశారు. హీరోహీరోయిన్లతోపాటు రాశి, వినోద్‌కమార్, సురేఖవాణి, రాజారవీంద్ర లాంటి పాపులర్ నటీనటులు తోడవ్వడంతో సినిమాపై క్రేజ్ పెరిగిందని, షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తామని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల తెలిపారు. ఈ సినిమాలో నటించడం పట్ల హీరోహీరోయిన్లు అమర్‌దీప్, సుప్రీతా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా సురేఖవాణి కూడా మట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: మరుధూరి రాజా, డీవోపీ: జి.వి.అజయ్‌కమార్, సంగీతం: కె.వి.జె.దాస్, సమర్పణ: మహర్షి కూండ్ల, నిర్మాణం: ఎం.3 మీడియా.

## హృదయాలను తాకే ప్రేమకథ

**హరికృష్ణ,** భవ్యశ్రీ జంటగా ఓ ప్రేమకథ తెరకెక్కుతున్నది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకుడు. తిరుపతి శ్రీనివాసరావు నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'హృదయాలను తాకే కథాంశంతో ఈ సినిమా రూపొందిస్తున్నాం. త్వరలో విడుదల తేదీని, ఆసక్తికరమైన టైటిల్‌తో ప్రకటిస్తాం.' అని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: విజయ్ కందుకూరి, కెమెరా: ప్రభాకర్‌రెడ్డి, సంగీతం: గౌతమ్ రవిరామ్, నిర్మాణం: టీఎస్ఆర్ మూవీ మేకర్స్.





## పల్లెటూరి అమ్మాయి కార్యదీక్ష

**రీతూవర్మ,** సూర్య వశిష్ట, శివ కందుకూరి, సుబ్బరాజు ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'దేవిక అండ్ డానీ' వెబ్ సిరీస్ ఈ నెల 6 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హీరోయిన్ రీతువర్మ మాట్లాడుతూ 'వెబ్ సిరీస్‌లో నటించాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. కాకపోతే ఔట్ ఆఫ్ ది బాక్స్‌గా కాన్సెప్ట్ ఉండాలని కోరుకున్నా. కరెక్ట్‌గా అలాంటి కథే నా దగ్గరకు వచ్చింది. అదే 'దేవిక అండ్ డానీ'. కథకు తగ్గట్టు సరైన టీమ్ కూడా కుదిరింది. అమ్మాయిలను 'నువ్వు ఇది చేయలేవ్.. అది చేయలేవ్..' అని చాలామంది డిస్కరేజ్ చేస్తుంటారు. అలాంటివారికి ఈ సిరీస్ ఓ పాఠం. అందరూ చూడదగ్గ సిరీస్ ఇది.' అన్నారు. వినోదం, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందిన ఈ సిరీస్ ఏడు ఎపిసోడ్స్ ఉంటుందని, దర్శకుడు కిశోర్ అద్భుతంగా తెరకెక్కించాడని, ఓ పల్లెటూరి అమ్మాయి కార్యదీక్షతో ఎలా ఎదిగింది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ సిరీస్ అని, రీతువర్మ అద్భుతంగా నటించిందని నిర్మాత సుధాకర్ చాగంటి చెప్పారు. స్క్రిప్ట్ పరంగానే కాక, సాంకేతికంగా కూడా సిరీస్ అద్భుతంగా ఉంటుందని దర్శకుడు బి.కిశోర్ తెలిపారు. ఇంకా మౌనిక, నందిని, డీవోపీ వెంకట్ సి.దిలీప్, సంగీత దర్శకుడు జైక్రిష్, ఎడిటర్ కార్తీక్ కూడా మాట్లాడారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.